మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 212 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 27 ఆగస్టు 2026 Ysr kadapa

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# ‘సంజీవని’

- కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ
- ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం
- వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 26:** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన ‘సంజీవని ప్రాజెక్టు’ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చున్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ‘సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు



కార్యాలయంలో బుధవారం ‘సంజీవని ప్రాజెక్ట్’పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో మిగతా2లో...




## నేపాల్‌లో ఆకస్మిక


# వరదలు

- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భీరతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం

## ఆధ్యాత్మిక పిఠాపురానికి

# అభివృద్ధి వెలుగులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.30.66 కోట్లు కేటాయింపు
- 24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు
- టీటీడీ కల్యాణ మండపానికి రూ.2 కోట్లు
- 48 భజన మందిరాలకు రూ.11.60 కోట్లు
- లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు‘



**మంగళగిరి,మన జనప్రగతి ఆగస్టు 26:** ఆధ్యాత్మికత కొలువైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి.. చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి.. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి” అనేది ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృఢ సంకల్పం. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే ఆయన కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోంది. పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకొని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి , భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ. 30.66 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం మిగతా2లో...

## ఎల్‌నినోతో రాష్ట్రంలో

# కరువు పరిస్థితులు

- పట్టించుకోని సిఎం చంద్రబాబు: విరుచుకుపడ్డ వైసపి అధ్యక్షుడు జగన్



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 26:** రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. చంద్రబాబు నిర్వాకం చూస్తే ప్రజలకు అర్థం అవుతుందని అన్నారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, డీఎస్సీ, ఏపీపీఎస్సీ అంశాలపై ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు మిగతా2లో...

## కోదాడ వద్ద ఘోర రోడ్డు

# ప్రమాదం

- ఆగివున్న లారీని
- ఢీకొన్న ట్రావెల్ బస్సు
- ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల
- దుర్మరణంమృతులంతా ఎపికి చెందిన
- వారిగా గుర్తింపు - ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి
- వ్యక్తం చేసిన సిఎం రేవంత్
- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం...








# ఎల్‌నినోపై చర్చకు ఎందుకు రాలేదు

- అసెంబ్లీకి వస్తే నిజాలు తెలుస్తాయని భయం
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

## అమరావతి శాసనసభ భవనానికి

# ప్రపంచస్థాయి రూపకల్పన

- నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక చర్చలు



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 26:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక వాస్తుశిల్పం తెలుగు సంస్కృతి సమ్మేళనంగా, రాష్ట్ర ప్రజాస్వామ్య వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా శాసనసభ భవన డిజైన్, నిర్మాణ ప్రణాళిక, ఇంటీరియర్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, సుస్థిర నిర్మాణ విధానాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, మిగతా2లో...




## అమెరికా ఘోర రోడ్డు

# ప్రమాదం

- చెట్టును ఢీకొన్న కారు....ముగ్గురు దుర్మరణం
- నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

**నిజామాబాద్,మన జనప్రగతి ఆగస్టు 26:** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు కుటుంబసభ్యులకు మిగతా2లో...

## ఏడుగురు మత్స్యకారులు

# క్షేమం

- పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురూ సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ
- బోటు ఎలా తప్పిపోయింది? ఏ మార్గంలో వెళ్లింది? అన్ని కోణాల్లో పరిశీలన
- మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో కుటుంబాల్లో ఊరట
- మత్స్యకారుల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత
- మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: మంత్రి



# జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

(మొదటి పేజీ తరువాయి)

అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి.
సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలి తాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాల కృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

**ఖాట్మండు:మన జనప్రగతి ఆగస్టు 26:** నేపాల్‌లో మెరుపు వరదలు భీభత్సం సృష్టించడంతో భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. ఈ ఘటనలో కనీసం 95 మంది మృతి చెందినట్టు నిర్ధారణ కాగా, 400 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో కనీసం 133 మంది భారతీయులున్నారు. అనేక భవనాలు, వాహనాలు, ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురదలో ఇంకా అనేక మంది కూరుకుపోయినట్టు అంచనా వేస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, భూకంపం, ఆపై కొండచరియలు విరిగిపడటంతోనే భోటెకోశీ నది ప్రళయానికి కారణమని నేపాల్ విదేశాంగ శాఖ శిశిర్ ఖనాల్ వెల్లడించింది. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో భూకంపం వచ్చిందని, దాంతో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు. నదీ ప్రవాహానికి కొండచరియలు అడ్డుపడటం ఆకస్మిక వరదలకు కారణమైనట్టు తెలుస్తోందని చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం, బుధవారం ఉదయం 9 గంటల సమయంలో టిబెట్ వైపు నుంచి వచ్చిన ఉద్ధృతి భోటేకోశి నదిలోకి చేరింది. దీంతో టిమురే, స్యాఫ్రు బేస్ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. గ్యిరాంగ్ సరిహద్దు క్రాసింగ్ సమీపంలోని టిబెట్ ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా, మరికొందరు గల్లయంతయ్యారని చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్హువా వార్త సంస్థ తెలిపింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు చైనా వైపు ఏర్పాటు చేసిన భద్రతా కమెరాల్లో భారీగా రాళ్లు, నీటితో కూడిన వరద ప్రవాహం ఈ ప్రాంతాన్ని ముంచెత్తడానికి కొన్ని క్షణాల ముందు ప్రజలు పరుగులు తీస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం ఆ వరద భవానాలు, వాహనాలను ధ్వంసం చేసిన పలువురు ప్రాణాలను బలిగొంది.కొండ చరియలు విరిగిపడడానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియనప్పటికీ.. జర్మన్ రీసెర్ట్ సెంటర్ ఫర్ జియోసైన్స్ (జీఎఫ్‌జడ్) ఆసక్తికరమైన విషయం వెల్లడించింది. భద్రతా కెమెరాలో దృశ్యాలు కనిపించిన సమయానికి సుమారు ఏడు నిమిషాలకు ముందు 4.4 తీవ్రతో భూమి కంపించినట్టు జీఎఫ్‌జడ్ తెలిపింది. భూకంపం అనంతరం కొండచరియలు విరిగిపడటం, టిబెట్ నుంచి వచ్చిన ఉద్ధృతి భోటెకోశి నదిలోకి చేరడంతో నేపాల్‌లో భారీ విలయం సంభవించిందని చెబుతున్నారు. మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

# ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గ వ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.17.06 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ.5 కోట్లు, శ్రీ పాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గతంలో పాడా ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని అన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మించారు. అలాగే, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ మాడ వీధుల విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, ఇతర సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో 419 భజన మందిరాలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భజన మందిరాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. భజనలు, ఆధ్యాత్మిక సమావేశాలు, స్థానిక సాంస్కృతిక వేడుకలు, గ్రామస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణతోపాటు ఆలయాల ఆధునికీకరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, గ్రామీణ సామాజిక వేదికల బలోపేతానికి దోహదపడనున్నాయి.

# ఎల్‌నినోతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. గత వారం డీఎస్సీ, ఏపీపీఎస్సీ వ్యవహారాలపై సీబీఐ విచారణకు సవాల్ చేసినప్పటికీ.. ప్రభుత్వం దానిపై స్పందించకుండా, అసలు అంశాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం సరైన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం లోటు మైనస్ 52 శాతంగా ఉందని పేర్కొన్నారు. కోస్తాంధ్రలో కూడా మైనస్ 47 శాతం వర్షపాతం లోటు నమోదైందని జగన్ తెలిపారు. 'గత వారం డీఎస్సీ, ఏపీపీఎస్సీపై సీబీఐ విచారణకు సవాలు చేశాం. దానిపై సీఎం చంద్రబాబు ఏమీ మాట్లాడరు. కోడు గుడ్డు మీద ఈకలు పీకినట్లుగా వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం స్పందించటం లేదు. బీసీ రిజర్వేషన్స్ పై చంద్రబాబు డ్రామాలు చేస్తున్నారు. పోలీసులే పాత్రధారులై గంజాయి విక్రయాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కరువు డేంజర్ బెల్స్ మోగుతున్నా స్పందన లేదు. జూన్, జూలై, ఆగష్టు వరకు వర్షపాతం లోటు మైనస్ 52 శాతంగా ఉంది. కోస్తాంధ్రలో వర్షపాతం లోటు మైనస్ 47 శాతం. ఏ జిల్లాలో చూసినా వర్షపాత లోటు ఉన్నా.. కుంభకర్ణుడిలా చంద్రబాబు నిద్ర నటిస్తున్నారు' అని వైఎస్ జగన్ ఫైర్ అయ్యారు. 'రాష్ట్రంలో 688 మండలాలకు గానూ 625 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 91 శాతం రాష్ట్రం లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటుంది. 434 మండలాలు లోటు వర్షపాతం కాగా.. 191 మండలాల్లో ఎక్కువ తీవ్రత కనిపిస్తుంది. రైతులను, ప్రజలను ఆదుకోవడానికి ఏ మాత్రం అడుగులు వేయటం లేదు. రాష్ట్రంలో 63 లక్షల ఎకరాలకు గానూ 80 శాతం మాత్రమే సాగైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత మధ్యలో జూలై 10న పంటలకు నీళ్లు ఇస్తామని మంత్రులు ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ప్రకాశం బ్యారేజ్ దగ్గర పబ్లిసిటీ స్టంట్ చేశారు. ఈ ఏడాది నీళ్లు ఇస్తారని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పంటలు సాగుచేశారు. వేసిన నార్లు మొత్తం ఎండిన పరిస్థితి ఉంది' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**సూర్యాపేట,మన జనప్రగతి ఆగస్టు 26:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వార కుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

# ఎల్‌నినోపై చర్చకు ఎందుకు రాలేదు

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 26:**ఎల్‌నినోపై అసెంబ్లీలో చర్చకు వస్తే వైకాపా ఐదేళ్ల పాలనలోని వాస్తవాలు బయటపడతాయనే జగన్ సభకు రాకుండా ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. చంద్రబాబు ముందుచూపుతో జలాశయాల్లో నీటిని నిల్వ చేయడం వల్లే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొంటు న్నామన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. గతంలో పట్టిసీమను విమర్శించిన జగన్.. ఇప్పుడు దాని ప్రయోజనాలను చూడాలన్నారు. రాయలసీమకు జగన్ ద్రోహం చేశారని, 102 టెండర్లు రద్దు చేశారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బీసీలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోతపై గతంలో పట్టించుకోని వ్యక్తికి ఇప్పుడు మాట్లాడే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. మద్యం రవాణా కుంభకోణంలో వైకాపా నేత కారుమూరి నాగేశ్వరరావు అడ్డంగా దొరికితే.. రాజకీయ ప్రయోజనాల కోసం బీసీ కార్డును వాడుతున్నారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మెప్పు కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ దోపిడీ, ధన దాహానికి ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ విధ్వంసానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# అమరావతి శాసనసభ భవనానికి ప్రపంచస్థాయి రూపకల్పన

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ ప్రతినిధులతో పాటు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ ఏ.వి. రావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసనసభ భవనం ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఆధునిక అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపకల్పన చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక వాస్తుశిల్ప సౌందర్యంతో పాటు, భవనం వినియోగించే ప్రతి వర్గానికి సౌకర్యవంతంగా, సమర్థవంతంగా ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ సముదాయంలో గౌరవ ముఖ్యమంత్రి ఛాంబర్, గౌరవ శాసనసభ స్పీకర్ ఛాంబర్, డిప్యూటీ స్పీకర్ ఛాంబర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ కార్యాలయం, బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశ మందిరం, మంత్రులు మరియు శాసనసభ్యుల కార్యాలయాలు, వివిధ శాసనసభ కమిటీల సమావేశ మందిరాలు తదితర విభాగాలను సమగ్రంగా ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు.అదేవిధంగా ప్రధాన సభా మందిరం కమిటీ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్స్, శాసనసభ్యుల లాబీలు, ప్రోటోకాల్ ప్రాంతాలు, మీడియా సెంటర్, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్, మీడియా వర్క్‌స్టేషన్లు, మీడియా బ్రీఫింగ్ సదుపాయాలు, సందర్శకుల గ్యాలరీలు, పబ్లిక్ లాంజ్‌లు, విజిటర్స్ రిసెప్షన్ ప్రాంతాలు వంటి కీలక సౌకర్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంపై ప్రతినిధులతో అభిప్రాయాలు పంచుకున్నారు.శాసనసభ కార్యకలాపాలను ఆధునిక పద్ధతుల్లో నిర్వహించేందుకు ఆడియో విజువల్ వ్యవస్థలు, డిజిటల్ ఓటింగ్, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, ఆధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్, లైవ్ టెలికాస్ట్, బ్రాడ్‌కాస్టింగ్ సదుపాయాలు, డిజిటల్ శాసన వ్యవస్థలు వంటి సాంకేతిక మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రోటోకాల్ మూవ్‌మెంట్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా జోన్లు, పార్కింగ్, డ్రాప్ ఆఫ్, పికప్ ప్రాంతాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వ్యవస్థలు వంటి అంశాలను డిజైన్‌లో సమర్థవంతంగా సమన్వయం చేయాలని చర్చించారు.

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం

**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 26:**
కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.ఈ నెల 3న వేటకు వెళ్లిన బోటు నిర్ణీత సమయంలో తిరిగి రాకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలి దిశ, సముద్ర ప్రవాహాలు, బోటు ప్రయాణ మార్గాలను పరిశీలించిన అధికారులు పశ్చిమ బెంగాల్ వైపు గాలింపు ముమ్మరం చేశారు.శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించారు. వారు ఆరోగ్యంగా ఉన్నారని, కుటుంబ సభ్యులతో మాట్లాడించామని మంత్రి తెలిపారు. వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని చెప్పారు.మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# జెన్‌జి యువతతో కోటంరెడ్డి భేటీలు

## - అభినందించిన మంత్రి లోకేశ్

**నెల్లూరు,మన జనప్రగతి ఆగస్టు 26:**
జెన్-జీ యువతతో నిరంతరం మమేకమై వారి ఆశయాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత అభిప్రాయాల ఆధారంగా వారికి ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్వహిస్తున్న 'జెన్-జీ యువతతో మాటామంతి' కార్యక్రమంపై లోకేశ్ ట్వీట్ చేశారు. యువతతో జరగనున్న ఆసక్తికరమైన, ఆలోచనాత్మకమైన భావ వినిమయ కార్యక్రమం కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. యువత ఆకాంక్షలు అర్థం చేసుకోవడానికి, వారికి ప్రయోజనకరంగా కార్యక్రమాలు నిర్వహించడానికి నిరంతర సంప్రదింపులు జరపాలని లోకేశ్ సూచించారు. మంత్రి లోకేశ్ దార్శనికతతో ప్రేరణ పొంది, తర్వాతి తరం ఆలోచనలు, ఆకాంక్షలు, అంచనాలు తెలుసుకునేందుకు జెన్ జీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం..!

● మత్స్యకారుల ఆచూకీ లభించడంతో మంత్రి సుభాష్ హర్షం



**రామచంద్రపురం/అమరావతి మన జనప్రగతి ఆగస్టు 26:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం అందడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి ఈ నెల 3న వేటకు వెళ్లి గల్లంతైన బోటు ఆచూకీ లభించిందని, అందులోని ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడిశాలోని పారాదీప్ తీరానికి చేరుకున్నట్లు అధికారులు ధ్రువీకరించారని మంత్రి తెలిపారు.గత 23 రోజులుగా మత్స్యకారుల ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం రావడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ పరిస్థితిని సమీక్షించారని మంత్రి తెలిపారు. గాలింపు చర్యల్లో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.బెంగాల్‌ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారుల ఆచూకీ లభించినట్లు సమాచారం అందిన వెంటనే వారిని స్వస్థలాలకు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే అధికారుల బృందాన్ని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు పంపించి మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.గత 23 రోజులుగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న వార్త ఎంతో ఊరటనిచ్చిందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ప్రభుత్వం వారి వెంటే ఉంటుందని, త్వరితగతిన వారిని స్వస్థలాలకు తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తిస్తుందని స్పష్టం చేశారు.

# అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం, బాధితులకు అండగా ఖాకీ

● పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ ● వీఆర్ బదిలీ వార్తలు కేవలం ఊహాగానాలే ● చట్ట పరిధిలో దోషులను శిక్షించడంలో రాజీ లేదు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 26:** పులివెందుల అర్బన్ పరిధిలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతూ,శాంతిభద్రతల పరిరక్షణలో ఖాకీ కఠినత్వం చూపిస్తున్నామని,అదే సమయంలో సామాన్య బాధితులకు న్యాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని అర్బన్ సీఐ శ్రీరామ్ స్పష్టం చేశారు.ఇటీవల తనను వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు బదిలీ చేసినట్లు,నిలుపుదల చేసినట్లు కొన్ని మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు.అవన్నీ కేవలం నిరాధారమైన ఊహాగానాలు మాత్రమేనని తెలిపారు.పులివెందుల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లా ఎస్పీ,ఉన్నతాధికారుల ఆదేశాలను క్రమశిక్షణతో పాటిస్తూ అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తున్నట్లు పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ,ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా చట్టం సామాన్యుడికి రక్షణగా ఉంటుందనే నమ్మకాన్ని పెంచేలా విధులు నిర్వహిస్తున్నానని అని అన్నారు.విధి నిర్వహణలో ఉన్న అధికారుల ఆత్మస్థైర్యాన్ని, క్రెడిబిలిటీని దెబ్బతీసేలా అసత్య కథనాలు ప్రసారం చేయడం సరికాదన్నారు.చట్ట పరిధిలో తమకున్న విచక్షణాధికారాలతో వచ్చిన ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పూర్తి స్థాయి రికార్డులను పరిశీలించి,ముద్దాయిల అక్రమాలను సాక్ష్యాధారాలతో సహా నిరూపించి చట్టపరంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దోషులను శిక్షించడంలో ఎలాంటి రాజీ ధోరణి ఉండబోదని,ప్రజలు ఇలాంటి నిరాధార ప్రచారాలను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామాల్లో ప్రశాంతత నెలకొల్పడమే మా లక్ష్యం: లింగాల ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి



**లింగాల మన జనప్రగతి ఆగస్టు 26:**–రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిలువరించడమే మా లక్ష్యమని లింగాల ఎస్ఐ డి.జదీశ్వర్ రెడ్డి అన్నారు.మండల పరిధిలోని ఎగువ,దిగువ లింగాల గ్రామాల్లో బుధవారం రాత్రి లింగాల ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తన సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...జిల్లా ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో,పులివెందుల డిఎస్పి శ్రీ బి మురళి గారి నేతృత్వంలో ఈరోజు ఎగువ, దిగువ లింగాల గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ మరియు స్థానిక సంస్థల ఎన్నికలు ఉద్దేశించి ప్రజలతో చర్చించడం జరిగింది. గ్రామాల్లో గొడవల, ఎవరైనా తాగి న్యూసెన్స్ చేసినట్టు తమ దృష్టికి వచ్చినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.మహిళల భద్రత సంబంధించి శక్తి యాప్లో అవగాహన కల్పించి మహిళలు ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే పోలీస్ వారిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగాల పోలీసులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి నేతన్నకూ 'నేతన్నల సేవలో' ఆర్థిక సాయం



**పెనుకొండ,మన జనప్రగతి ఆగస్టు 26: –** మగ్గం నేసే ప్రతి అర్హుడైన నేతన్నకు 'నేతన్నల సేవలో' పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామని, కొత్తగా 36,617 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ నెలాఖరు వరకు అర్హుల గుర్తింపు పూర్తి చేసి, అనంతరం రెండో విడతలో మిగిలిన అర్హుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని వెల్లడించారు.నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి తెలిపారు. చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం కింద 51,952 మంది లబ్ధి పొందుతున్నారని, 86 వేల మంది నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందుతున్నాయని చెప్పారు.ధర్మవరంలో రూ.38 కోట్లతో మెగా చేనేత క్లస్టర్, మంగళగిరిలో చేనేత పార్కుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చిన్న క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 'నేతన్నల సేవలో' పథకంపై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, అర్హులైన ప్రతి నేతన్నకూ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# పులివెందులలో చోరీల ముఠా గుట్టురట్టు

## ముగ్గురు నిందితుల అరెస్ట్,రూ.8.08 లక్షల సొత్తు స్వాధీనం: అర్బన్ సీఐ శ్రీరామ్

## సీసీటీవీ 360 టెక్నాలజీతో నిందితులను పసిగట్టిన పోలీసులు





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 26:–** పులివెందుల పట్టణంలో వరుసగా మోటార్ సైకిళు ,,ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి,వారి వద్ద నుంచి రూ.8.08 లక్షల నగదు ను స్వాధీనం చేసికొన్నట్లు అర్బన్ సీఐ కె.శ్రీరామ్ వెల్లడించారు.బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.జిల్లా ఎస్పీ నచ్చికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,డీఎస్పీ బి.మురళి పర్యవేక్షణలో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఈ ముఠా పట్టుబడినట్లు తెలిపారు.రూ.7,08,000 విలువైన 7 మోటార్ సైకిళ్లు మిట్టమల్లేశ్వర స్వామి దేవాలయం వద్ద దొంగిలించిన 3 బైక్‌లు,జయమ్మ కాంప్లెక్స్ వద్ద చోరీ చేసిన 4 బైక్‌లను అలాగే కనంపల్లి సమీపంలోని నామాలగుండు సిద్ధిలింగేశ్వర స్వామి ఆలయంలో రెండు ఇనుప తలుపులు,కిటికీ,సుమారు 250 కిలోల స్లాబ్ ఇనుప కడ్డీలను దొంగిలించి విక్రయించగా వచ్చినరూ.1,00,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ చోరీలకు పాల్పడిన వారి వివరాలను తెలుపుతూ భూపతి మధు (27),తండ్రి లేట్ శ్రీనివాసులు,నెహ్రూ రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్ మోటార్ సైకిల్ చోరీల నిందితుని హెలిప్యాడ్ వద్ద,అరెస్ట్ చేసినట్లు తెలిపారు.గురువింటి మధు కృష్ణ (37), తండ్రి బాల రాజు,కందుకూరి వెంకట శివయ్య (43), తండ్రి చిన్న మహానంది యెర్రగుడిపల్లి, పులివెందుల ఆలయ చోరీ నిందితులను కదిరి రింగ్ రోడ్డు వద్ద,అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

**'సీసీటీవీ 360' సాఫ్ట్‌వేర్‌తో వేగవంతమైన దర్యాప్తు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆధునిక 'సీసీటీవీ 360' సాఫ్ట్‌వేర్ దర్యాప్తులో పోలీసులకు ఎంతో కీలక సాధనంగా మారిందని సీఐ శ్రీరామ్ పేర్కొన్నారు.ఈ ఆధునిక వ్యవస్థ సహకారంతోనే పాత నేరస్తులు,చోరీలకు పాల్పడుతున్న దొంగలను అతి తక్కువ సమయంలో గుర్తించి పట్టుకోగలిగామన్నారు.వాహనాలు లేదా వస్తువులు చోరీకి గురైనా,వ్యక్తులు అదృశ్యమైనా బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఆయన ప్రజలకు సూచించారు.నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన ఎస్సైలు ఎం.మధుసూదన్ రెడ్డి,ఎల్.తిమోతి మరియు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మీలాద్-ఉన్-నబీ వేడుకల్లో భక్తిశ్రద్ధలు



**పత్తికొండ మన జనప్రగతి మన ఆగస్టు 26:–** మీలాద్–ఉన్–నబీ పండుగ సందర్భంగా పత్తికొండలోని పెద్ద మసీదు జామియా మస్జిద్ అహ్లె సున్నత్ వల్ జమాత్‌లో బుధవారం వివిధ మతపరమైన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫజర్ నమాజ్ అనంతరం దరూద్ షరీఫ్, జిక్ర్ (దైవస్మరణ) కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు కారుమంచి ఫఖ్రుద్దీన్ సాహెబ్ నిజామీ పర్యవేక్షణలో జరిగాయి.అనంతరం దరూద్ వ సలాం, ఫాతెహా ఖ్వానీ నిర్వహించగా, జామియా మస్జిద్ ఇమామ్, ఖతీబ్ హాఫిజ్ వ ఖారీ ముహమ్మద్ ఫారూఖ్ సాహెబ్ నిజామీ దువా చేశారు. అనంతరం తబర్రుకాత్ (పవిత్ర ప్రసాదం) పంపిణీ చేశారు.ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రసంగం, పిల్లల కార్యక్రమం నిర్వహించారు. హాఫిజ్ వ ఖారీ ముహమ్మద్ గౌస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలు ఖురాన్ పఠనం, నాత్, సలాం, సంభాషణలు, దువాలు, కలిమాలను చక్కగా ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన పిల్లలను ప్రోత్సహిస్తూ వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవిత చరిత్ర, సత్ప్రవర్తన, బోధనలు, ఆదర్శ జీవితం గురించి ప్రత్యేకంగా ప్రసంగించారు. నిజాయితీ, విశ్వసనీయత, దయ, కరుణ, న్యాయం, సత్ప్రవర్తనలకు ప్రవక్త ముహమ్మద్ (స) అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. ఆయనను మక్కా ప్రజలు 'సాదిఖ్' (సత్యవంతుడు), 'అమీన్' (నమ్మకస్తుడు)గా గౌరవంగా పిలిచేవారని తెలిపారు. హిరా గుహలో తొలి దివ్యవాణి అవతరించిన అనంతరం ఏకదైవారాధన, సత్యం, ధర్మం, ప్రేమ, దయ, న్యాయం వైపు ప్రజలను ఆయన ఆహ్వానించారని పేర్కొన్నారు. 622లో మదీనా మునవ్వరాకు హిజ్రత్ చేసిన అనంతరం సోదరభావం, న్యాయం, శాంతి, సామాజిక సమానత్వానికి ఆదర్శంగా నిలిచే సమాజాన్ని నిర్మించారని వివరించారు.జోహర్ నమాజ్ అనంతరం జామియా మస్జిద్‌లో పవిత్ర అవశేషాల (ఆసార్–ఎ–ముబారక్) దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు.అసర్ నమాజ్ అనంతరం జామియా మస్జిద్ అహ్లె సున్నత్ వల్ జమాత్ నుంచి మీలాద్–ఉన్–నబీ జులూస్ ప్రారంభమైంది. మస్జిద్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఫక్కు మియా దర్గా వరకు జులూస్ కొనసాగింది. దర్గా వద్ద జులూస్ ముగిసింది. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల తమ భక్తి, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. జులూస్‌లో పాల్గొన్న వారికి ఫక్కు మియా దర్గా వద్ద భోజన ఏర్పాట్లు చేశారు.మీలాద్–ఉన్–నబీ సందర్భంగా నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో ముస్లిం సోదరులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# ప్రజా సమస్యల కంటే జగన్‌కు రాజకీయాలే ముఖ్యం: మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, మన జనప్రగతి ఆగస్టు 26:–** ప్రజా సమస్యల కంటే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాజకీయాలే ముఖ్యమయ్యాయని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సాగునీరు, వ్యవసాయం, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టులపై గత ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రూ.13,500 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాజెక్టులను 2029 నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని చెప్పారు.రైతులకు పంటల బీమా బకాయిలు చెల్లించడంతో పాటు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేల చొప్పున అందిస్తున్నామని మంత్రి తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు.రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యం నుంచి కాపాడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని, రెండేళ్లలో సుమారు రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు.ప్రజా సమస్యలపై చర్చించాలంటే జగన్ ప్రెస్‌మీట్లకు పరిమితం కాకుండా అసెంబ్లీకి వచ్చి చర్చించాలని కొల్లు రవీంద్ర సవాల్ చేశారు

# అభివృద్ధిపై చర్చకు సిద్ధం: మంత్రి సవిత



**గోరంట్ల, మన జనప్రగతి ఆగస్టు 26: –** వైసీపీ నాయకులకు మంత్రి సవిత స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని, ప్లేస్, టైమ్ వారే నిర్ణయించుకోవచ్చని సవాల్ చేశారు. నోరుంది కదా అని ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో రూ.2.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్లు, త్వరలో ఇళ్ల స్థలాలు అందజేస్తామని చెప్పారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించిందని మంత్రి అన్నారు. ఇకపై ఏటా డీఎస్సీలు నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు.పెనుకొండలోనే పుట్టి, పెరిగానని, స్థానిక ప్రజలకు తన గురించి తెలుసని మంత్రి సవిత అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# సీఎం చంద్రబాబుతో మౌలానా ముస్తాక్ అహ్మద్ భేటీ

● మైనారిటీల సంక్షేమం, యువతకు ఉపాధిపై కీలక చర్చ



**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 26:**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, తెదేపా మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అలాగే మైనారిటీ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పన తదితర కీలక అంశాలపై ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు అందిస్తున్న విశేష సహకారం, మార్గదర్శకత్వానికి ముస్తాక్ అహ్మద్ ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీపీ మిషన్ల పంపిణీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 26:**–కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినం (ఆగస్టు 27) పురస్కరించుకుని బుధవారం ముందస్తుగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా హృషికేశవరెడ్డి (లోమడ),చిన్నా (పులివెందుల) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి బీపీ (బ్లడ్ ప్రెజర్) మిషన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ నాయకులు,వైద్య సిబ్బంది పాల్గొని ఎంపీ అవినాష్ రెడ్డికి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో తొండూరు మండల అధ్యక్షుడు వైఎస్ మదన్ మోహన్ రెడ్డి,సింహాద్రిపురం మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి,పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప,పులివెందుల మండల ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్,నాయకులు దాసరి ఈశ్వరయ్య,లోమడ రాజబాబు,గంగరాజు,మహేష్,శ్రీకాంత్,భరత్,ప్రశాంత్ మరియు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి (మెడికల్ కాలేజ్) డాక్టర్లు,డిప్యూటీ సూపరింటెండెంట్లు,నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గో సేవలో మండల నాగేంద్ర శనగల బస్తా వితరణ



**రైల్వేకోడూరు మన జన ప్రగతి ఆగస్టు 26:** గోసేవను మహోన్నత సేవగా భావిస్తూ ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ మండల నాగేంద్ర స్థానిక వెంకయ్యస్వామి ఆలయం సమీపంలోని గంగమ్మ గుడి వద్ద ఉన్న గోవులకు మేత అందజేశారు. బుధవారం అక్కడికి చేరుకున్న ఆయన ఒక బస్తా చెనగలను గోవులకు అందించి స్వయంగా మేత వేస్తూ గోసేవలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల నాగేంద్ర మాట్లాడుతూ...మూగజీవాల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. గోవులకు ఆహారం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని పేర్కొన్నారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు గోసేవ వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.స్థానికులు ఆయన చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.గోవుల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సాహకరంగా ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు.

## ఎల్ఎల్సీ కాల్వకు నీరు విడుదల



**ఆలూరు మన జనప్రగతి ఆగస్టు 26:**– తుంగభద్ర ఎల్ఎల్సీ కాల్వకు నీరు విడుదల చేయించడంలో ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి కీలక పాత్ర పోషించారు. గత నాలుగు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఎల్ఎల్సీ కాల్వకు నీటిని విడుదల చేయించేందుకు ఆమె కృషి చేశారు.ఎల్ఎల్సీ కాల్వకు నీరు విడుదల కావడంతో ఆలూరు ప్రాంత ప్రజలకు తాగునీటి అవసరాలు తీరడంతో పాటు రైతులకు సాగునీటి వెసులుబాటు కలగనుంది. ఈ చర్యపై రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వైకుంఠం జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

## పెద్దముడియం పోలీస్ స్టేషన్ పరిధిలోని జె.కొట్టాలపల్లి గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్

**పెద్దముడియం మన జనప్రగతి ఆగస్టు 26:**– జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పెద్దముడియం పోలీస్ స్టేషన్ పరిధిలోని జె.కొట్టాలపల్లి గ్రామాన్ని ఎస్.ఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణకు పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై రైల్వేకోడూరు పోలీసులు ఉక్కుపాదం



**రైల్వేకోడూరు మన జన ప్రగతి ఆగస్టు 26:**రైల్వే కోడూరు పోలీసులు రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా పట్టణంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు సూచనలతో రైల్వేకోడూరు టౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలోని మామిడికాయల మండి సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న రెండు గూడ్స్ లారీలు, ఒక కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా వాహనాలను సీజ్ చేసి, మద్యం సేవించిన వాహనదారులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రహదారి ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకుండా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు.రహదారి ప్రమాదాల నివారణకు వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా:బత్యాల



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 26:**–క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్న తాను పార్టీ పరంగా సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు,నాయకులు,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్సీ,టీడీపీ సీనియర్ నాయకులు బత్యాల చంగల్‌రాయుడు అన్నారు. బుధవారం సిద్ధవటం మండలంలోని ఏపీఎస్పీ బెటాలియన్ కళ్యాణ మండపంలో జరిగిన పెద్దపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస నాయుడు కుమారుడి వివాహానికి బత్యాల హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధికారం ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకులు, రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పార్లమెంట్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, మైదుకూరు టీడీపీ నాయకుడు రామచంద్రనాయుడు, మాజీ జెడ్పీటీసీ చలమయ్య యాదవ్, ఉన్నం కిరణ్‌స్వామి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఐక్యత,సంస్కృతికి ప్రతిబింబం తీజ్ పండుగ: మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి మన జనప్రగతి ఆగస్టు 26:**–గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు.మైసిగండిలో గిరిజనులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకలకు ముఖ్యఅతిథిగా గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి హాజరై, గిరిజన సోదర సోదరీమణులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెళ్లికాని గిరిజన యువతులు తీజ్ పండుగ సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో తమ ఆరాధ్య దైవాలను పూజిస్తూ,మంచి వరుడు లభించి, తమకు త్వరగా వివాహం జరగాలని కోరుకోవడం ఈ పండుగలో కొనసాగుతున్న ఒక ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు.తీజ్ పండుగ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, గిరిజనుల జీవన విధానం,విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతిబింబమని ఆయన అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న గిరిజనుల ఆచార సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు శ్రీరాములు, తులసి రామ్, అర్జున్ ,ప్రకాష్,రంగస్వామి, గోవర్ధన్,రవీంద్ర,రాజు, గోపాల్,పరమేశ్,టీకి లాల్, శారద,నందిని,ఇందు, స్థానిక నేతలు,ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మదర్ థెరిస్సా 116వ జయంతి

- దివ్యాంగులకు గృహోపకరణాల పంపిణీ





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 26:**ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మదర్ థెరిస్సా చూపిన కరుణ,త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శమని,విద్యార్థులు సేవాతత్పరతను అలవర్చుకోవాలని ముఖ్య అతిథి,జేఎన్‌టీయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ పేర్కొన్నారు.మదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి,25 మంది దివ్యాంగులకు గృహోపకరణాలు (హాట్ బాక్సులు),పండ్లు,స్వీట్లు పంపిణీ చేశారు.అభాగ్యుల కోసం మదర్ థెరిస్సా స్థాపించిన సేవా సంస్థలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయని,ఆమెకు భారతరత్న,నోబెల్ శాంతి బహుమతులు లభించడం గర్వకారణమని హెల్పింగ్ హ్యాండ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ సాంబయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి,జిమ్ ట్రైనర్ వినయ్ కుమార్, జేఎన్‌టీయూ విద్యార్థులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరును మత్తు పదార్థాల రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి: రాచమల్లు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 26:**–గంజాయి, మద్యం, బెల్ట్ షాపులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని రాచమల్లు కోరారు. మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. మత్తు పదార్థాల ప్రభావంతో యువతలో నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు, పోలీసులు, ప్రజాప్రతినిధులు కలిసి గంజాయి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. శివాలయం సర్కిల్‌లో ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్యే, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రొద్దుటూరు పట్టణాన్ని మత్తు పదార్థాల నుంచి రక్షించాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడాన్ని రాజకీయ కోణంలో చూడకుండా, వాటిపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరుగుతున్నాయో అధికారులకు సమాచారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాచమల్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.

## ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు

- రామ్ లక్ష్మణ్ రెడ్డి,ఆదికేశవరెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- జయమ్మ కాలనీ వసతి గృహంలో నిరాశ్రయులకు దుప్పట్లు,పండ్ల పంపిణీ
- పాల్గొన్న మున్సిపల్ ఇన్‌ఛార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 26:** కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్.అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పులివెందుల పట్టణంలో ముందస్తుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక జయమ్మ కాలనీలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి, తొండూరు మండల యువ నాయకులు కంచర్ల ఆది కేశవరెడ్డిల ఆధ్వర్యంలో పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి చేతుల మీదుగా నిరాశ్రయులకు దుప్పట్లు,పండ్లు మరియు బ్రెడ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జ్ వై.ఎస్. మనోహర్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప,తొండూరు మండల అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవకే అంకితమై,నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సేవా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పార్నపల్లి కిషోర్,పద్మనాభ రెడ్డి,రవి,అరుణ్ రెడ్డి,సుకూర్,రఫీలతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవాలపై వైసీపీ ద్వంద్వ వైఖరి



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 26:–**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలు ఉండకూడదని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని టీడీపీ నేతలు విమర్శించారు. బుధవారం సిద్ధవటం మండలం దిగువపేట గ్రామంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఇంటింటా టీడీపీ కరపత్రాల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసీపీ ఓర్వలేకపోతోందని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు ఘనమైన తీర్పు ఇవ్వడం ఖాయమని పేర్కొన్నారు.వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో బలవంతపు ఏకగ్రీవాలు చేసింది మీరే కాదా..? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఏకగ్రీవాలపై వైసీపీ నేతలు జగన్నాటకం ఆడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు సాధారణమేనని, దీనిపై వైసీపీ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్,క్లస్టర్ ఇన్‌చార్జి రాజనాయుడు,పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి,పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టు సాగుపై ఆధునిక సాంకేతిక అభివృద్ధి కార్యక్రమం




**కడప మన జనప్రగతి ఆగస్టు 26:–**మేరా రేశం మేరా అభిమానఇది భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, సెంట్రల్ సిల్క్ బోర్డు నిర్వహిస్తున్న పట్టు సాగు మరియు సెరికల్చర్ అభివృద్ధి కార్యక్రమం.ఈ కార్యక్రమం ప్రధానంగా పట్టు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడం, ఉత్పత్తి నాణ్యత పెంచడం మరియు వారి జీవనోపాధిని మెరుగుపరచడంపై దృష్టి పెడుతుంది.కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యంఈ పథకం ద్వారా పట్టు రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం, వ్యాధి నియంత్రణ, మంచి నాణ్యత గల కోకూన్ల ఉత్పత్తి , పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు అందించే సబ్సిడీలు వంటి అంశాలపై శిక్షణ మరియు సాంకేతిక మార్గదర్శనం అందించబడుతుంది. దీని లక్ష్యం కేవలం పట్టు ఉత్పత్తి పెంచడం మాత్రమే కాదు, రైతుల ఆదాయం మరియు గ్రామీణ ఉపాధిని కూడా బలోపేతం చేయడం. పట్టు ఎలా తయారవుతుంది..?గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు ఎందుకు ఇది ముఖ్యమైనది..? పట్టు పరిశ్రమలో రైతులు, మహిళలు, కార్మికులు, నూలు వడికేవారు, చేనేత కళాకారులు ఇలా అనేక మంది జీవనోపాధి పొందుతారు. అందువల్ల పట్టు రంగం అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుంది. ఈ కార్యక్రమం పట్టు విలువ గొలుసులో ప్రతి దశను బలోపేతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తుంది. **ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం** ఆంధ్రప్రదేశ్ పట్టు అభివృద్ధిలో మంచి పాత్ర పోషిస్తోంది.2025లో మేరా రేశం మేరా అభిమాన్ కార్యక్రమం కింద పట్టు అభివృద్ధికి ఉత్తమ రాష్ట్ర అవార్డు ఆంధ్రప్రదేశ్‌కు లభించింది అనే గుర్తింపు రాష్ట్రం చేసిన సెరికల్చర్ అభివృద్ధి ప్రయత్నాలను ప్రతిబింబిస్తుంది.హాజరైన అధికారులు. డాక్టర్ భరత్ కుమార్. దీక్షిత్. ఈ నాగేశ్వర్ రెడ్డి. వెంకటరమణ. సరళ. సిద్దేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మీలాద్-ఉన్-నబీ వేడుకలు



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 26:–**చెన్నూరు మండలంలో బుధవారం మీలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మహమ్మద్ ప్రవక్త బోధనలు, సందేశాలను ప్రజలకు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.మహమ్మద్ ప్రవక్త చూపిన మానవత్వం, సమానత్వం, విద్య, స్త్రీల గౌరవం, ప్రకృతి పరిరక్షణ, శాంతి, క్షమాగుణం, నిజాయితీ, పొరుగువారి పట్ల బాధ్యత వంటి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని చెన్నూరు మండల ఖాజీ, హాఫిజ్ డాక్టర్ ఫసీర్ అహ్మద్ తెలిపారు. కులం, మతం, రంగు, ధనం ఆధారంగా వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని ప్రవక్త బోధించారని పేర్కొన్నారు. అలాగే విద్యను అందరూ అభ్యసించాలని, మహిళలను గౌరవించాలని, ప్రకృతి, జీవుల పట్ల దయ చూపాలని ఆయన సూచించారని తెలిపారు.పొరుగువారు ఆకలితో ఉన్నప్పుడు వారిని ఆదుకోవాలని, మతభేదాలకు అతీతంగా అందరికీ సహాయం చేయాలని ప్రవక్త బోధించారని ఫసీర్ అహ్మద్ వివరించారు. ఈ బోధనల కారణంగానే మహమ్మద్ ప్రవక్తను సకల లోకాలకు కరుణామూర్తిగా గౌరవిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కో–ఆప్షన్ సభ్యుడు వారీస్, పలువురు మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# కాకినాడ అపోలోలో అరుదైన గుండె శస్త్రచికిత్స విజయవంతం

● 62 ఏళ్ల వృద్ధురాలికి పునర్జన్మ






**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 26:–**తీవ్ర గుండె సంబంధిత సమస్యతో ప్రాణాపాయ స్థితిలో చేరిన 62 ఏళ్ల వృద్ధురాలికి కాకినాడ అపోలో ఆసుపత్రి వైద్యులు అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. సాధారణంగా మెట్రో నగరాల్లో మాత్రమే సాధ్యమయ్యే ఈ చికిత్సను కాకినాడలోనే విజయవంతంగా పూర్తి చేసి వైద్య బృందం తమ నైపుణ్యాన్ని చాటుకుంది.తీవ్రమైన ఛాతీ నొప్పి, ఆయాసంతో ఆసుపత్రిలో చేరిన సదరు మహిళను పరీక్షించగా, శరీరానికి రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళం 'అయోర్టా' చీలిపోయినట్లు తేలింది.దీనితో పాటు గుండెకు రక్తాన్ని చేరవేసే మరో రెండు ప్రధాన రక్తనాళాల్లోనూ బ్లాకేజీలు ఉన్నట్లు గుర్తించారు.రక్తపోటు పెరిగితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే అత్యవసర పరిస్థితి కావడంతో, ఇతర నగరాలకు తరలించే సమయం లేక వైద్యులు వెంటనే శస్త్రచికిత్సకు సిద్ధమయ్యారు.ప్రముఖ కార్డియోవాస్కులర్ & థొరాసిక్ సర్జన్ డాక్టర్ పుష్యమి వేములపల్లి నేతృత్వంలో దాదాపు 7 నుంచి 8 గంటల పాటు ఈ ఆపరేషన్ సాగింది.వైద్యులు చీలిపోయిన ప్రధాన రక్తనాళం భాగాన్ని తొలగించి కృత్రిమ గ్రాఫ్ట్ అమర్చడంతో పాటు ("సుప్రా కొరోనరీ అసెండింగ్ అయోర్టా రీప్లేస్‌మెంట్'),బైపాస్ సర్జరీని (సీఏబీజీ) విజయవంతంగా పూర్తి చేశారు.రోగి వయస్సు పైబడటం,కణజాలం బలహీనంగా ఉండటం,ముందు నుంచే తీవ్రమైన ఆస్తమా సమస్య ఉండటం వైద్యులకు పెద్ద సవాలుగా మారింది.అయినప్పటికీ కార్డియాలజీ,అనస్థీషియా,క్రిటికల్ కేర్,పల్మనాలజీ,ఐసీయూ,ఓటీ,నర్సింగ్ బృందాల సమష్టి కృషితో ఆపరేషన్ విజయవంతమైందనీ.ప్రస్తుతం ఆ మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.కాకినాడ వంటి నగరంలో అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక సాంకేతికత,అనుభవజ్ఞులైన వైద్య బృందం అందుబాటులో ఉండటం వల్లే 'గోల్డెన్ అవర్'లో రోగి ప్రాణాలు కాపాడగలిగామని వైద్యులు పేర్కొన్నారు.

# పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం




**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 26:–**వినాయకచవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేందుకు అందరూ సహకరించాలని చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఉత్సవ కమిటీల సభ్యులకు సూచించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణంలో బుధవారం వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకొని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే ప్రాంతంలో విగ్రహాలు ఏర్పాటుచేయాలని అన్నారు.రాత్రి 10గంటల నుండి ఉదయం 6గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, డిజే లు నిర్వహించరాదు అన్నారు. బాణాసంచా వినియోగంలో నిబంధనలను పాటించాలని, రాజకీయ పార్టీల పాటలు, ఫొటోలు, జండాలు, నినాదాలు, పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదు అన్నారు. బలంతంగా విరాళాలు వసూలు చేయరాదని, నిమజ్జనంలో ఉపయోగించే వాహనాలను ముందుగా ఏర్పాటు చేసుకొని పోలీసులు అనుమతించిన మార్గం, తేదీ, సమయంలో మాత్రమే చేరాలన్నారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు, ఇరుగు పొరుగు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సినబాధ్యత కమిటీలదే అంటూ ఇందుకు భిన్నంగా వ్యవహారిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ ఐ.వినోద్ కుమార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# మానవత్వానికి చిరునామా మదర్ థెరిసా

● మాజీ ఎంపీ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 26:–** మానవత్వానికి చిరునామా నిలువెత్తు ప్రతిరూపం భారతరత్న,నోబెల్ అవార్డు గ్రహీత మదర్ థెరిసా అని రాజ్యసభ మాజీ సభ్యుడు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు.వేంపల్లి లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి తన సతీమణి అలివేలమ్మతో కలిసి మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా భావించిన మహోన్నత మానవతా మూర్తి మదర్ థెరిసా అన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని సేవా మూర్తి మదర్ థెరిసా అని ఆయన కొనియాడారు.కుష్టు రోగులకు శాంతినగర్ కాలనీలు,బిక్షగాళ్ళు,దేశదిమ్మర్లకు ప్రేమ్ నివాసులు, అనాధ శిశువులకు శిశు సదన్ లు నిర్మించి దరిద్ర నారాయణుల్లో, అనాధల్లో భగవంతుని దర్శించిన మదర్ థె రిసా జీవితం అందరికీ ఆదర్శం,అనుసరణీయం,స్ఫూర్తిదాయకం,మార్గదర్శకం అని తులసి రెడ్డి కొనియాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,చిన్నకోట్ల నాగరాజు,ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.


# కరుణకు ప్రతిరూపమైన మదర్ తెరిస్సా ఘనంగా116 జయంతి వేడుక





**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 26:–**ప్రేమకు కరుణకు సంఘసంస్కర్తకు ప్రతిరూపమైన మదర్ తెరిసా 116 వ జయంతిని కాకినాడ ప్రతాప్ నగర్ కూడలి వద్ద గల మదర్ తెరిసా విగ్రహం వద్ద కిలారి ప్రభుదాస్ అనే ఒక సంఘసంస్కర్త సుమారు 10 సంవత్సరాల క్రితం మదర్ తెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేసి అప్పుడు నుండి ఆమె జయంతి వేడుకలను నిర్వహిస్తూ పలువురికి అన్నదానం వస్త్రదానం చేస్తూ తన వంతు సహాయంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని చుట్టుపక్కల వార్డులో ఉన్న నిరుపేదలకు మదర్ తెరిసా యొక్క ప్రాముఖ్యత వివరించి వారి సమక్షంలో కేక్ ను కట్ చేసి అనంతరం ప్రతి ఒక్కరికి చీరలు టవల్స్ పంపిణీ చేసి పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. బుదిరెడ్డి రాజు,(డిస్కో రాజు) ,కునపురెడ్డి శంకర్ నారాయణ, జొన్నాడ వెంకటరమణ, వాసిరెడ్డి సత్యకుమార్, జె డి పవన్, దంగేటి పద్మావతి, జొన్నాడ సుబ్రహ్మణ్యం, పిల్లి శ్రీను, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధ్వజస్తంభం, కలశ ప్రతిష్ఠలు వైభవంగా





**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 26:–**దేవనకొండ మండలం కుంకునూరు గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి,శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ధ్వజస్తంభం,కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే సుంకలమ్మ, బంగారమ్మ విగ్రహాలకు ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు.దేవాలయంలో కలశ ప్రతిష్ఠతో పాటు గ్రామంలోని వేప, రావి చెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేప, రావి చెట్లకు వైభవంగా వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో


# పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి



**కడప మన జనప్రగతి ఆగస్టు 26:–**కడప నగరంలోని 21 వ డివిజన్ ఎర్రముక్కపల్లి నుంచి నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ప్రభుత్వ విప్,కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు,చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు.అలాగే ప్రభుత్వ పాలనా విజయాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.అనంతరం స్థానిక ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలు,అభిప్రాయాలను తెలుసుకుని,ప్రజా సంక్షేమం మరియు కడప అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని తెలిపారుఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి.మన్సూర్ అలీ ఖాన్,అమర్నాథ్ రెడ్డి,రంజిత్,రాణి,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ ఓటు హక్కు.. మీ బాధ్యత!

**● నేటి గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి ● 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి**




**తొర్రూరు ప్రతినిధి, మన జనప్రగతి ఆగస్టు 26:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ లో భాగంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి యువత పోరాకు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని ప్రకటించారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో నేడు గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నామని గ్రామాల వారీగా గ్రామ సర్పంచులు తెలియపరిచారు. **గ్రామ సభల్లో నేడు జరగనున్న విశేషాలు?.**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)లో భాగంగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నేటి గ్రామసభ / వార్డు సభలు నిర్వహిస్తారు **సభలో ఏం జరుగుతుంది?** ముసాయిదా ఓటర్ల జాబితాలోని అన్ని ఓటర్ల పేర్లను చదివి వినిపిస్తారు. జాబితాలో పేరు లేని అర్హులైన పౌరుల వివరాలను పరిశీలిస్తారు.మొదటి 1వ తేదీ అక్టోబర్ నెల 2026 సంవత్సరం నాటికి 18 ఏళ్లు నిండే వారు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు అర్హత లేని వ్యక్తుల పేర్లపై వారం-7 ద్వారా అభ్యంతరం తెలియజేయవచ్చు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ధృవీకరణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తారు **ఇది ఎక్కడ చేస్తారు ?.** గ్రామీణ ప్రాంతాల్లో: సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో మరియు పట్టణ ప్రాంతాల్లో: సంబంధిత పోలింగ్ కేంద్రంలో మీ పేరు ఓటర్ల జాబితాలో ఉందో తెలుసుకోండి తప్పులు ఉంటే సరిదిద్దుకోండి అర్హత ఉంటే ఓటరుగా నమోదు చేసుకోండి.

# ఎస్ఐఆర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాలకు కాంగ్రెస్ శ్రేణుల సమాయత్తం

**గ్రామసభలకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలి : బుడిగం లక్ష్మీనారాయణ**

**సీరోల్,మన జనప్రగతి ఆగస్టు 26:** డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు సీరోల్ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న ఎస్ఐఆర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాలు ((గ్రామసభలు)ను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీన గురువారం ఉదయం 9 గంటలకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్ఐఆర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో గ్రామాల అభివృద్ధి, ప్రజలకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్ష



నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, బీఎల్ఏలు, బీఎల్ఏ సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో సమావేశాలు సజావుగా జరిగేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సర్ ఫేజ్-2 రివ్యూ సమావేశాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని బుడిగం లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు.

# నేడు గ్రామసభను విజయవంతం చేయండి: బాలిన రవి కుమార్

**● ఎస్ఐఆర్ ఫేజ్2లో భాగంగా గ్రామసభల నిర్వహణ**



**సీరోల్, మన జనప్రగతి ఆగస్టు 26:**ఎస్ఐఆర్ ఫేజ్2లో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశానుసారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభల ద్వారా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఫేజ్- 2 కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని చిలుకోయలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలిన రవి కుమార్ పిలుపునిచ్చారు.గ్రామాల్లో ఓటరు జాబితా పరిశీలన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామంలో అర్హులైన పౌరులందరూ గ్రామసభలకు హాజరై తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేర్లు లేని వారు, వివరాల్లో మార్పులు ఉన్న వారు గ్రామసభలో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని బాలిన రవి కుమార్ కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బి ఎల్ ఏ లు సూపర్వైజర్లు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ఫేజ్2 గ్రామసభలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని, రామ పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారని అన్నారు

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల నగదు బహుమతి

**-మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ వెల్లడి**

**తొర్రూరు ప్రతినిధి, మన జనప్రగతి ఆగస్టు 26:** ఎవరికైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ప్రతి ఒక్కరు కూడా బాధితునికి సహాయం చేసే అవకాశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించింది..ఆదుకున్నందుకు వారికి తగిన పారితోషకాన్ని ప్రకటించింది.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహ్-వీర్ పథకం గురించి జిల్లా ప్రజలు తెలుసుకోవాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు .రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు మొదటి గంట (గోల్డెన్ అవర్ ) గా ఎంతో కీలకమని, ఈ సమయంలో గాయాలపాలైన వారిని వెంటనే ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని రహ్-వీర్‌గా గుర్తిస్తారని తెలిపారు. అర్హత పొందిన రహ్-వీర్‌కు రూ.25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారని పేర్కొన్నారు. **పౌరులు ఏం చేయాలి?.**రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఉన్నా, ప్రమాదాన్ని చూసినా పౌరులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించాలని శంకర్ నాయక్ సూచించారు. బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం తమ వివరాలను ఆస్పత్రిలో ఇవ్వాలని తెలిపారు. అక్కడి నుంచి సంబంధిత



ఏరియా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, సహాయం చేసిన వ్యక్తి వివరాలతో పాటు ఏ ఆస్పత్రిలో బాధితుడిని చేర్పించారనే సమాచారాన్ని తెలియజేస్తారని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే జిల్లా స్థాయి కమిటీ ద్వారా వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న రహ్-వీర్‌కు రూ.25,000 నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.**రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటి?.** మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 134(ఎ) ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని రహ్-వీర్ గా పరిగణిస్తారని తెలిపారు.రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించడం, ప్రమాద సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సామాన్య ప్రజలను ప్రోత్సహించడం అని శంకర్ నాయక్ వివరించారు.అలాగే బాధితులకు సహాయం చేసే పౌరులకు ఎలాంటి పోలీస్ లేదా చట్టపరమైన ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించడం కూడా ఈ పథకంలోని ముఖ్య ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు.సంవత్సరానికి ఐదు సార్లు అవకాశం ఉంటుంది. సంవత్సరానికి ఒక వ్యక్తికి (5) సార్లు మాత్రమే రహ్-వీర్ నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇస్తారు అని శంకర్ నాయక్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు.ఒక వ్యక్తి సమయానికి స్పందించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా, ఒక కుటుంబాన్ని విషాదం నుంచి రక్షించినవారవుతారని ఆయన అన్నారు. రహ్-వీర్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీటీఓ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

# నగరంలో ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు



**కరీంనగర్, మన జనప్రగతి ఆగస్టు 26:** కరీంనగర్ నగరంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.బొంబాయి స్కూల్ నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమై నగరంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. అనంతరం ర్యాలీ కరిముల్లాహ్ షా దర్గాహ్ వద్దకు చేరుకుని ముగిసింది.ర్యాలీలో ముస్లిం మత పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవక్త మహమ్మద్ నీ బోధించిన శాంతి, సోదరభావం, మానవ తా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ర్యాలీ నిర్వహించారు.ఈ శాంతి ర్యాలీలో మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. నగరంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# గుండెపోటుతో నిండిన శోకం..



**- తాజుద్దీన్ కుటుంబానికి ఆర్‌పీవీ జాతీయ అధ్యక్షుల ఓదార్పు**

**- గుండెపోటు మరణాలపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: సయ్యద్ సాదిక్ అలీ**

**ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి ఆగస్టు 26:** అకాల మరణం ఒక కుటుంబాన్ని ఒక్కసారిగా శోకసముద్రంలోకి నెట్టివేస్తుందని, క్షణాల్లో ప్రాణాలను హరిస్తున్న గుండెపోటు మరణం వెనుక ఆ కుటుంబ సభ్యులు జీవితాంతం అనుభవించే వేదన దాగి ఉంటుందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక (ఆర్‌పీవీ) వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబాన్ని బుధవారం ద్వారకానగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మైనారిటీ వర్గాల సంక్షేమానికి తాజుద్దీన్ చేసిన సేవలు చిరస్మరణీయం అని సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. తాజుద్దీన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను కలసి వారి కష్టంలో భాగస్వాములయ్యారు. స్వచ్ఛమైన మనసు, నిరంతర ప్రజాసేవతో అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకున్న తాజుద్దీన్ అకాల మరణం మైనారిటీ వర్గాలకే కాకుండా, ఆయనను అభిమానించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని భావోద్వేగంగా మాట్లాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ తీరని లోటును పూడ్చడం ఎవరి వల్లా సాధ్యం కాదని, ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి మానవీయ బాధ్యత అని పేర్కొన్నారు.తాజుద్దీన్ కుమారుడు బీటెక్, కుమార్తె బీడీఎస్ చదువుతున్న విషయాన్ని తెలుసుకున్న సయ్యద్ సాదిక్ అలీ, వారి విద్యాభ్యాసం ఎక్కడా ఆగిపోకుండా భవిష్యత్తుపై ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. తండ్రిని కోల్పోయిన బాధను మాటల్లో ఓదార్చలేమని, అయినప్పటికీ కుటుంబ సభ్యులు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని కోరారు. తాజుద్దీన్ కుటుంబాన్ని ఈ విషాద సమయంలో ఒంటరిగా భావించవద్దని, పిల్లల భవిష్యత్తు కోసం కుటుంబానికి అవసరమైన సమయంలో తన వంతు సహకారం, అండదండలు అందిస్తామని భరోసా ఇచ్చారు.**గుండెపోటుపై ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం** ఇటీవలి కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు ఘటనలు ఆందోళన కలిగించే స్థాయిలో చోటుచేసుకుంటున్నాయని సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. క్షణాల్లో ప్రాణాలను హరిస్తున్న గుండెపోటు కారణంగా అనేక కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు గుండె వైద్య నిపుణులతో అవగాహన శిబిరాలు నిర్వహించి, గుండె ఆరోగ్యంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో సకాలంలో స్పందించడం, గుండెపోటు లక్షణాలను గుర్తించడం, ప్రాథమిక చికిత్స (సిపిఆర్) పై ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇచ్చేలా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.తాజుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ తీరని విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని సయ్యద్ సాదిక్ అలీ ప్రార్థించారు.

# రాజీవ్ నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలి: వైఎస్ మనోహర్ రెడ్డి

**• ఆర్డీవోతో కలిసి ఇళ్లు కోల్పోతున్న ప్రాంతాల పరిశీలన**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 26:** పులివెందులలోని రాజీవ్ గాంధీ కాలనీలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు తక్షణమే ప్రత్యామ్నాయ స్థలాలు చూపి,నష్టపరిహారం అందించాలని మున్సిపల్ వైకాపా ఇన్‌ఛార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఆర్డీవో చిన్నయ్య కాలనీని సందర్శించగా,సమాచారం అందుకున్న వైఎస్ మనోహర్ రెడ్డి,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్‌తో కలిసి అక్కడికి చేరుకుని అధికారులతో కలిసి ప్రభావిత ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళు ్లగా నివాసముంటున్న పేదలకు ముందస్తుగా నివాస స్థలాలు కేటాయించి,ప్రభుత్వం నుంచి పూర్తి నష్టపరిహారం అందించాలన్నారు.ఇళ్లలోకి వెళ్లే దారి లేకుండా కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా గుంతలు తవ్వడంపై మండిపడ్డారు.బాధితులకు స్పష్టమైన భరోసా దక్కే వరకు పనులను సరిదిద్దాలని పేర్కొన్నారు.ఆర్డీవో హామీ బాధితుల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చిన్నయ్య కాలనీవాసులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల స్పెషల్ టెట్‌కు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి వినతి



**పులివెందుల మన జనప్రగతి ఆగస్టు 26:-** ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించనున్న స్పెషల్ టెట్‌లో ప్రత్యేక వెసులుబాట్లు కల్పించాలని బుధవారం సాయంత్రం ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు.1530 ఏళ్లుగా సేవలందిస్తున్న, 50 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయుల వయస్సు, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని 40 శాతం (60 మార్కులు) కనీస అర్హతగా నిర్ణయించాలని కోరారు. పరీక్షను కంప్యూటర్ ఆధారితంగా కాకుండా పెన్-పేపర్/ ఓయంఆర్ విధానంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ప్రశ్నపత్రంలో 60 శాతం ప్రశ్నలను ఉపాధ్యాయులు బోధించే ప్రధాన సబ్జెక్టు లేదా సంబంధిత కంటెంట్ నుంచి ఇవ్వాలని, మిగిలిన ప్రశ్నలను పెడగాజీ, సైకాలజీ, మెథడాలజీ, తెలుగు, ఇంగ్లిష్ తదితర అంశాల నుంచి ఇవ్వాలని సూచించారు.ప్రతి ఏడాది టెట్ నిర్వహించడం కాకుండా, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల టెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్పెషల్ టెట్ నోటిఫికేషన్‌లో తగిన మార్పులు చేయించాలని ఎమ్మెల్సీని అభ్యర్థించారు.

# ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణమే లక్ష్యం



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 26:-** అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతి శాసనసభ భవన రూపకల్పనపై అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధులతో సచివాలయంలో కీలక చర్చలు జరిగినట్లు చెప్పారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 265 శాసనసభ, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా భవనాన్ని డిజైన్ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. శాసనసభ భవనం పైన ప్రత్యేక టవర్, ప్రజల కోసం ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఉభయ సభల సభ్యుల కోసం సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.అండర్‌గ్రౌండ్ పార్కింగ్‌తో పాటు పచ్చదనంతో కూడిన ప్రాంగణాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికత, మెరుగైన సౌకర్యాలు, పచ్చదనం, భవిష్యత్ అవసరాల సమన్వయంతో శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలకు ఆహ్వానం



**పటాన్ చెరువు మన జనప్రగతి ఆగస్టు 26:-** ఇస్నాపూర్ మున్సిపాలిటీ జై గోకుల కృష్ణ యాదవ్ సేవా సంగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోటే సుమలత, ప్రముఖ నాయకుడు మోటే కృష్ణ యాదవ్‌కు సంగం సభ్యులు మర్యాదపూర్వకంగా అం దజేశారు.ఈ సందర్భంగా సంగం ప్రతినిధులు వేడుకల విశిష్టత, నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల పోటీలు, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, భక్తి కార్యక్రమాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరి సహకారం కోరారు.మోటే కృష్ణ యాదవ్, చైర్‌పర్సన్ మోటే సుమలత జై గోకుల కృష్ణ యాదవ్ సేవా సంగం చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, యువతలో సాంస్కృతిక విలువలు పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలు యాదవ్, అజయ్ యాదవ్, రాములు యాదవ్, మలాద్రి యాదవ్, తిమ్మప్ప యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఏడుకొండల యాదవ్, బాలాజీ యాదవ్, మల్లయ్య యాదవ్, ఎన్. కేశవ యాదవ్, అనంతయ్య యాదవ్ తదితర యాదవ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.జై గోకుల కృష్ణ యాదవ్ సేవా సంగం ఆధ్వర్యంలో జరగనున్న ఈ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# కడపలో పోలీసుల స్పెషల్ డ్రైవ్.. 19 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు



**కడప,మన జనప్రగతి ఆగస్టు 26:-** ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా కడప సబ్ డివిజన్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి పర్యవేక్షణలో ఆగస్టు 25న ఈ తనిఖీలు చేపట్టారు.ప్రత్యేక పోలీసు బృందాలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, లాడ్జీలు, ధాబాలు, అనుమానాస్పద ప్రదేశాలు, ప్రధాన రహదారుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 19 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 27 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మొత్తం 35 వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన 3 వాహనాలను సీజ్ చేశారు. నేరాల నివారణలో భాగంగా 20 లాడ్జీలు, ధాబాలను తనిఖీ చేశారు.అలాగే సమస్యాత్మక ప్రాంతంలో ఒక కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సీకే దిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలోని మేరీ నగర్‌లో చేపట్టిన తనిఖీల్లో 41 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ప్రత్యేక తనిఖీలను కడప 1 టౌన్, కడప 11 టౌన్, కడప తాలూకా, చిన్నచౌక్, సీకే దిన్నె, కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు.కడప సబ్ డివిజన్ పరిధిలో బహిరంగ మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మద్యం సేవించిన అనంతరం వాహనాలు నడపవద్దని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. తమ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ కోసం ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కడప సబ్ డివిజన్ పరిధిలో నిరంతరం కొనసాగుతాయని కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి తెలిపారు.

# 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం: మంత్రి రామానాయుడు



**మార్కాపురం,మన జనప్రగతి ఆగస్టు 26:-** మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కల ఈ నెల 31న సాకారం కానుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు చెప్పారు. మంగళవారం రాత్రి వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో పర్యటించిన మంత్రి ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాసితుల కాలనీలను సందర్శించి మౌలిక వసతులపై అధికారులకు సూచనలు చేశారు.వెలిగొండ కోసం భూములు, ఆస్తులు త్యాగం చేసిన సుమారు 7 వేల నిర్వాసిత కుటుంబాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాసితులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే నిర్వాసితులకు రూ.768 కోట్లు అందించామని తెలిపారు.నిర్వాసితులకు రేషన్, పెన్షన్ తదితర సంక్షేమ పథకాలు ఎలాంటి ఆటంకం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్ సాగుకు ప్రత్యేక చర్యలు




**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 26:-** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.జూన్ నుంచి ఆగస్టు 25 వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 51 శాతం తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికతో ఖరీఫ్ సాగు కొనసాగుతోందన్నారు. పప్పుధాన్యాల సాగు గత ఏడాదితో పోలిస్తే 23.6 శాతం పెరిగి 2.66 లక్షల హెక్టార్లకు చేరిందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ఫిబ్రవరి నుంచే అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమీక్షలు నిర్వహించి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతులకు పంట నష్టాల నుంచి రక్షణ కల్పించేందుకు 'రైతన్న మీకోసంఎల్‌నినో ప్రభావ నివారణ ప్రణాళికఖరీఫ్ 2026' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.పంటల బీమా దరఖాస్తులు గత ఏడాది 19.5 లక్షల నుంచి ఈ ఏడాది 35.1 లక్షలకు పెరిగాయని, బీమా విస్తీర్ణం 7.83 లక్షల నుంచి 15.1 లక్షల హెక్టార్లకు పెరిగిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు రూ.13,983 కోట్ల విలువైన పంటలకు బీమా భరోసా కల్పించామన్నారు.గత ప్రభుత్వం వదిలిన సుమారు రూ.2 వేల కోట్ల పంటల బీమా బకాయిలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులపై భారం మోపకుండా పంటలకు బీమా రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



# చామలూరు, ఎర్రగుడి గ్రామాల్లో డ్రోన్ నిఘా

**తాళ్ల ప్రొద్దుటూరు మన జనప్రగతి ఆగస్టు 26:-**
కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ మంజునాథ ఆధ్వర్యంలో చామలూరు, ఎర్రగుడి గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ నిఘా చేపట్టారు. నేరాలకు ఆస్కారం ఉన్న,
జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా అనుమానాస్పద కదలికలు, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రజలు అప్ర మత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురు మత్స్యకారులు క్షేమం




**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 26:-** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.ఈ నెల 3న వేటకు వెళ్లిన బోటు నిర్ణీత సమయంలో తిరిగి రాకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలి దిశ, సముద్ర ప్రవాహాలు, బోటు ప్రయాణ మార్గాలను పరిశీలించిన అధికారులు పశ్చిమ బెంగాల్ వైపు గాలింపు ముమ్మరం చేశారు.శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించారు. వారు ఆరోగ్యంగా ఉన్నారని, కుటుంబ సభ్యులతో మాట్లాడించామని మంత్రి తెలిపారు. వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని చెప్పారు.మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# మిలాద్‌ఉన్ నబీ సెలవు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి



**కడప మన జనప్రగతి ఆగస్టు 26:-** మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన సెలవును అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా పాటించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు.సెలవు రోజున విద్యార్థులను తరగతులకు పిలిపించడం, ఉపాధ్యాయులను విధులకు లేదా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ఒత్తిడి చేయడం నిలిపివేయాలని కోరారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో సెలవు నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత విద్యాశాఖ, ఇంటర్, యూనివర్సిటీ అధికారులు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అంకన్న డిమాండ్ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల విశ్రాంతి హక్కులను పరిరక్షించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు మహేష్, ఉపేంద్ర పాల్గొన్నారు.

మనజనప్రగతి

27- 08 - 2026

# ప్రధాని కార్యక్రమానికి ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అవకాశం**

**ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్**

**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి కార్యక్రమానికి ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్రీడా విద్యార్థులు**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 26:-**జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈ నెల 27న నిర్వహించనున్న ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే అవకాశం ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్రీడా విద్యార్థులకు లభించడం సంస్థకు, విద్యార్థులకు గర్వకారణమని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయప్రకాష్ తెలిపారు.ప్రముఖ హాకీ క్రీడాకారుడు, భారత క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈ నెల 27న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా సుమారు 1,600 ప్రాంతాల నుంచి పాల్గొనే 8 లక్షల మందికి పైగా యువతను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువ క్రీడాకారులను ఒకే జాతీయ వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్రీడా విద్యార్థులకు అవకాశం లభించడం పట్ల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రధానమంత్రితో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు పాల్గొని క్రీడల పట్ల తమ అనుభవాలు, ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలను జాతీయ స్థాయిలో ప్రతిబింబించే అవకాశం పొందనున్నారు.ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే క్రీడా విద్యార్థులతో డైరెక్టర్ ప్రొఫెసర్ విజయప్రకాష్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం ప్రాధాన్యతను వివరిస్తూ క్రమశిక్షణ, సమయపాలన, క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసంతో కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ప్రధానమంత్రి స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం విద్యార్థుల ప్రతిభకు గుర్తింపుతో పాటు, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి స్ఫూర్తినిస్తుందని అన్నారు.విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ట్రిపుల్‌ఐటీ చేస్తున్న కృషికి ఈ ఎంపిక నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.జాతీయ స్థాయి కార్యక్రమంలో తమ విద్యార్థులు పాల్గొనడం సంస్థకు గర్వకారణమని, ఈ అవకాశం ఇతర విద్యార్థుల్లోనూ క్రీడల పట్ల మరింత ఆసక్తి, ఉత్సాహాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ మై భారత్ అధికారులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువతను ఒకే జాతీయ వేదికపైకి అనుసంధానించే ఈ కార్యక్రమం యువ క్రీడాకారులకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి సందేశం ద్వారా యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడంతో పాటు దేశ క్రీడారంగ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి డాక్టర్ పెనుకొండ రవికుమార్, జాతీయ సేవా సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ డి. కోనప్ప, శారీరక విద్యా విభాగం అధిపతి రమణారెడ్డి, క్యాంపస్ నిర్వహణ అధికారి ఓబయ్య పాల్గొన్నారు.

# ఉద్యోగంలో చేరినప్పుడు లేని టెట్ నిబంధన ఇప్పుడు ఎందుకు..?

- వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 26:-**ఉద్యోగంలో చేరే సమయంలో టెట్ నిబంధన లేని ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ తప్పనిసరి చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం వారిని మానసిక ఆందోళనకు గురిచేస్తోందని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు.ఆమె మాట్లాడుతూ..సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిర్వహించిన నియామక ప్రక్రియలో అన్ని అర్హతలను పరిశీలించి,అర్హులుగా నిర్ధారించిన తర్వాతే ఉపాధ్యాయులను ఉద్యోగాల్లోకి తీసుకున్నారని తెలిపారు. అప్పట్లో టెట్‌ను తప్పనిసరి చేయకుండా నియామకాలు చేపట్టి, ఇప్పుడు సంవత్సరాల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు అందించిన తర్వాత టెట్ అర్హత పేరుతో మళ్లీ పరీక్ష రాయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు."ఉద్యోగంలో చేరేటప్పుడు లేని నిబంధనను ఇప్పుడు ఎందుకు తెస్తున్నారు? ఇన్నేళ్లు ఉపాధ్యాయులుగా పనిచేసిన వారి సామర్థ్యాన్ని ఇప్పుడు ఒక పరీక్షతో నిర్ణయిస్తారా?" అని నాగమణి ప్రశ్నించారు.ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక టెట్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలే కారణమని చెబుతున్నప్పటికీ, ఆ తీర్పును అమలు చేసే విషయంలో ఉపాధ్యాయులపై భారం పడకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే, ప్రత్యేక టెట్ పేరుతో ఉపాధ్యాయులను భయపెట్టడం కాకుండా వారికి ఉచిత శిక్షణ, తగినంత సమయం, అనేక అవకాశాలు కల్పించాలని నాగమణి డిమాండ్ చేశారు. ప్రభుత్వం తాజాగా ప్రత్యేక టెట్‌కు దరఖాస్తుల ప్రక్రియను ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు నిర్వహించనుందని, పరీక్షలు అక్టోబర్ 11 నుంచి 21 వరకు జరగనున్నాయని వెల్లడించింది. ఈ ప్రత్యేక పరీక్షకు సుమారు 72 వేల మందికి పైగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు హాజరు కానున్నట్లు సమాచారం ఉందన్నారు.ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని,టెట్‌లో ఉత్తీర్ణత సాధించలేని ఉపాధ్యాయులకు కూడా పునఃపరీక్షలు, శిక్షణా అవకాశాలు కల్పించాలని నాగమణి కోరారు.

# హామీలు అమలు చేయకుండా టెండర్లు ఎలా వేస్తారు..?







**కేకే కొట్టాల గ్రామస్తుల ఆవేదన**

**ముందుగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి**

**ఆ తర్వాతే టయిలింగ్ పాండ్ పనులు చేపట్టాలన్న కేకే కొట్టాల గ్రామ ప్రజలు**

**వేముల మన జనప్రగతి ఆగస్టు 26:-** వేముల మండల పరిధిలోని తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్)కు సంబంధించిన వ్యర్థాల టయిలింగ్ పాండ్ సమీపంలోని కేకే కొట్టాల గ్రామానికి ముందుగా న్యాయం చేయాలని గ్రామానికి చెందిన మోహన్‌బాబు డిమాండ్ చేశారు. గ్రామం, రైతుల భూములు టయిలింగ్ పాండ్ కారణంగా నష్టపోయిన నేపథ్యంలో గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాండ్ ఎత్తు పెంపు పనులకు టెండర్లు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. పూర్తిస్థాయి పునరావాసం, పరిహారం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన తర్వాతే టయిలింగ్ పాండ్ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. **ఆరు నెలల్లో హామీలు అమలు చేయాలి**గత డిసెంబర్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో రైతులు, యూసీఐఎల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు మోహన్‌బాబు తెలిపారు. కేకే కొట్టాల గ్రామానికి పూర్తిస్థాయి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించి, పునరావాసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు భూములకు మెరుగైన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. గ్రామానికి న్యాయం చేసిన తర్వాతే టయిలింగ్ పాండ్ నిర్మాణ పనులు చేపట్టాలని, ఇందుకు ఆరు నెలల గడువు ఇచ్చారని తెలిపారు. అయితే గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి నోటిఫికేషన్, పత్రికా ప్రకటన వెలువడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. **రూ.172 కోట్ల టెండర్‌పై అభ్యంతరం** టైలింగ్ పాండ్ కంట్రోల్ లెవల్ 360 మీటర్లకు చేరుకోగా ఇప్పటికే అదనంగా 20 మీటర్ల ఎత్తు పెంచారని, ఇప్పుడు మరో 7 మీటర్లు పెంచేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని మోహన్‌బాబు తెలిపారు. గ్రామానికి న్యాయం చేయకుండానే రూ.172 కోట్ల వ్యయంతో టయిలింగ్ పాండ్ పునర్నిర్మాణ పనులకు టెండర్ జారీ చేయడం అన్యాయమన్నారు. ఇంత భారీ మొత్తంతో పాండ్ ఎత్తు పెంచిన తర్వాత కేకే కొట్టాల గ్రామానికి ఎప్పుడు పునరావాసం కల్పిస్తారని ప్రశ్నించారు. **టెండర్ రద్దు చేయాలని డిమాండ్** టైలింగ్ పాండ్ వల్ల నష్టపోయిన కేకే కొట్టాల గ్రామాన్ని ముందుగా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసి న్యాయం చేసిన తర్వాతే పాండ్ ఎత్తు పెంపు పనులు చేపట్టాలని మోహన్‌బాబు డిమాండ్ చేశారు. తక్షణమే టెండర్‌ను రద్దు చేయాలని కోరారు.సమస్య పరిష్కారం కాకపోతే ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకుని టయిలింగ్ పాండ్ వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి కేకే కొట్టాల గ్రామానికి న్యాయం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి జేఏసీ కృషి




**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 26:-**జిల్లా కేంద్రంగా పరిపాలన కొనసాగిన సిద్ధవటంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల జేఏసీ అధ్యక్షులు బండారు రాజగోపాలయ్య తెలిపారు .బుధవారం మండల కేంద్రంలోని శ్రీ సాయి హైస్కూల్ ప్రాంగణంలో జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధవటం బస్టాండ్ కూడలిలో మహిళల కోసం టాయిలెట్లు,బాత్రూం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని,ఆర్టీసీ బస్సుల నిలుపుదలకు పాత ప్రభుత్వ వైద్యశాల భవనాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి దృష్టికి సమస్యలను తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ శివారులోని అటవీ శాఖ ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌ను తొలగించే విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.రాత్రి 10 గంటల తర్వాత చెక్‌పోస్ట్ కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జనరల్ సెక్రటరీ పాలెం నారాయణ, కోశాధికారి బసెట్టి సుబ్రహ్మణ్యం,శ్రీ సాయి హైస్కూల్ కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి జి.సిద్దయ్య, జేఏసీ సభ్యులు మల్లు వెంకటసుబ్బారెడ్డి,కొట్టే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో జిమ్ ట్రైనర్ దారుణ హత్య

- భానుగుడి సెంటర్‌లో అర్ధరాత్రి ఘటన
- కర్రతో మెడపై దాడి చేసి హతమార్చినట్లు ప్రాథమిక సమాచారం




**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 26:-** కాకినాడ నగరంలోని భానుగుడి సెంటర్‌లో బుధవారం తెల్లవారుజామున ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.మృతుడిని కోడమాటి సతీష్‌రెడ్డి (30)గా పోలీసులు గుర్తించారు.ఆయన జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.భానుగుడి ప్రాంతంలోని చార్మినార్ టీ సెంటర్ సమీపంలో సతీష్‌రెడ్డిపై బందుల సాయికిరణ్ (30), అతని స్నేహితులు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. కర్రతో మెడ భాగంలో పొడిచి హత్య చేసినట్లు ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు.హత్యకు వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చన్న కోణంలో కాకినాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# విద్యుత్ షాక్‌కు గురై జూనియర్ లైన్‌మన్ మృతి

**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 26:-**విద్యుత్ షాక్‌కు గురై జూనియర్ లైన్‌మన్ మృతి చెందిన ఘటన కాకినాడలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..కాకినాడ జిల్లా కాజులూరు మండలం చాకిరేవుమెరకకు చెందిన కొప్పిశెట్టి ప్రసాద్ (32) రామారావుపేట సెక్షన్ డి-1లో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు.బుధవారం మెయిన్‌రోడ్ మసీదు సెంటర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందంటూ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు రావడంతో మరమ్మతుల కోసం ప్రసాద్ విద్యుత్ స్తంభం ఎక్కారు. తీగలను పరిశీలిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం గుర్తించిన సిబ్బంది ప్రసాద్‌ను స్తంభం నుంచి కిందకు దించారు.ఈ ప్రమాదానికి ల్యాండ్‌మార్క్ వ్యాపార సంస్థ నిర్వహణలోని విద్యుత్ వ్యవస్థ కారణమై ఉండవచ్చని ప్రసాద్ బంధువులు ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సిమెంట్ దిమ్మపై ఏర్పాటు చేయకుండా నేలపైనే ఉంచారని, విద్యుత్ అంతరాయం సమయంలో జనరేటర్ ఆన్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. యువ లైన్‌మన్ మృతితో కుటుంబ సభ్యులు, సహచరులు కన్నీరు మున్నీరయ్యారు. ఘటనపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174